ఖరీఫ్ సాగుకు వేళాయె..

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- వరుణ దేవుని కరుణ కోసం ఎదురుచూపులు
- ప్రస్తుతం మండుతున్న ఎండలతో ఆందోళన


చింతలపూడి మండలంలో ఖరీఫ్ దుక్కులు దున్నుకుంటున్న దృశ్యం


బుట్టాయగూడెంలో మండలంలో సాగు పనుల్లో నిమగ్నమైన రైతు

బుట్టాయగూడెం: మృగశిర కార్తె ప్రారంభమైంది. ఎండలు తగ్గడంతోపాటు చిరు జల్లులు మొదలయ్యే సమయం ఆసన్నమైంది. వాతావరణం మొత్తం చల్లబడి వర్షాలు కూడా విస్తారంగా కురిసే సమయం ఇది. ఇటీవల అకాల వర్షాలు కురిసినప్పటికీ గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలు దంచికొడుతున్నాయి. రోహిణీ కార్తె తన ప్రతాపాన్ని చూపించింది. అయితే మృగశిర కార్తె ప్రారంభమైనప్పటికీ ఎండలు కాస్తూనే ఉన్నాయి. మరో 2 రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చేసిన ప్రకటనతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంట పనులను కూడా చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు పంట పొలాల్లో దుక్కులు కూడా సిద్ధం చేసుకున్నారు. కాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యేక ప్రణాళికతో వ్యవసాయ సాగును ముందుకు తీసుకువెళ్తామని అధికారులు చెబుతున్నారు.

32,663 హెక్టార్లలో సాగుకు సన్నాహాలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 32,663 హెక్టారుల్లో పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. వీటిలో బుట్టాయగూడెం మండలంలో 6,562 హెక్టార్లు, జీలుగుమిల్లి మండలంలో 4,749, పోలవరం మండలంలో 3,328, కొయ్యలగూడెం మండలంలో 6,257, టి.నర్సాపురం మండలంలో 9,729, వేలేరుపాడు మండలంలో 1,160, కుక్కునూరు మండలంలో 878 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పెసలు, వేరుశనగ, మినుములు, జొన్న, తదితర పంటలను రైతులు పండించే విధంగా కృషి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వర్షాల కోసం ఎదురుచూపులు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో తొలకరి వర్షాలు ఊరిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతాంగం వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా మృగశిర కార్తెలో విత్తనాలు చల్లితే మంచి దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం, కాని వాతావరణం చూస్తుంటే ఇప్పట్లో వర్షాలు కురిసేలా కనిపించడం లేదు. అయినా రైతులు పొలాల్లో ఎరువులు తోలుకుని, దుక్కులు దున్నుకుని, నారుమళ్ళు పోసుకోవడానికి సంసిద్ధులవుతున్నారు. వర్షాలు కురిస్తే వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏటా జూన్ 15 నాటికి నారుమళ్లు పోసి జూలై 15 నాటికి నాట్లు వేయడం పూర్తయ్యేది. అలాంటిది ఈ ఏడాది మాత్రం దుక్కులు దున్ని, నేలను చదును చేసుకుని ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు వెనుక బడటం నిరాశను మిగిల్చాయి.

ఇప్పటివరకు సరైన వర్షాలే లేవు

ప్రతి ఏడాది సబ్ డివిజన్‌లో సుమారు 17 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంటారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 145 మి.మీ కురవాల్సి ఉండగా ఇప్పటి వరకూ సరైన వర్షాలు కురవలేదు. ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవకుండా జల్లులు మాత్రమే పడుతుండటంతో వ్యవసాయానికి ఈ వర్షాలు ఉపయోగపడవని రైతులు చెబుతున్నారు. అయితే గత వారం రోజులుగా ఎండలు మండి పోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో ఇప్పట్లో వర్షాలు పడే సూచనలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. వర్షాలు ప్రారంభమైతే వ్యవసాయ శాఖ రైతులకు సకాలంలో అందించేలా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సాగుకు ప్రణాళిక సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, పెసలు, శనగలు, మినుము, జొన్న, ప్రత్తి వంటి పంటలను పండించేలా రైతులను ప్రోత్సహిస్తాం. ఇందుకోసం ఒక ప్రత్యేకమైన ప్రణాళికను కూడా సిద్ధం చేశాం. రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నాం.

– పీజీ బుచ్చిబాబు, సహాయ వ్యవసాయ సంచాలకుడు, కేఆర్‌పురం

అధైర్యపడొద్దు



రైతులు అధైర్య పడాల్సిన పని లేదు. రుతుపవనాలు కొద్దిగా మందగించాయి. సకాలంలో వర్షాలు కురుస్తాయి. ఖరీఫ్ వ్యవసాయానికి ఎలాంటి ఢోకా ఉండదు. గత నెలలో రైతులకు 3,152 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశాం.

– బి నాగకుమార్, ఏడీఏ, చింతలపూడి సబ్‌డివిజన్

క్లుప్తంగా

సెర్ప్ ఆధ్వర్యంలో యోగ


యోగ చేస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: సెర్ప్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం సీనియర్ సిటిజన్ మహిళలచే యోగా డే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో అలవాటుగా చేసుకుంటే ఆరోగ్యవంతంగా, మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమృతవాణి, యోగా టీచర్లు గంగాదర్, గంగారాం, డీపీఎం సుబ్బారావు, ఏపీఎం రామారావు, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

మృగశిర కార్తెలో చేపలకు డిమాండ్


చేపలు విక్రయిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఫిష్ ఆంధ్ర భవనం వద్ద ఆదివారం చేపల కొనుగోళ్లు ఎక్కువగా కొనసాగాయి. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదని శాస్త్రంగా, శాస్త్రీయంగా కూడా పెద్దలు పేర్కొనడంతో మాంసాహార ప్రియులు చేపల కొనుగోళ్లకు ఉత్సాహం చూపారు. సాధారణ రోజుల్లో కంటే మృగశిర కార్తె ప్రారంభం రోజున చిన్న చేపలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, అందులోనూ కొన్ని జాతుల చేపలకు రెండు నుంచి మూడు రెట్లు అధిక ధర పలుకుతుందని మత్స్యకార మహిళలు తెలిపారు.

సుందరకాండ పారాయణ


సుందరకాండ పారాయణలో పాల్గొన్న భక్తులు

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణ సోమవారంతో ముగియనుందని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. స్వామి వారి సన్నిధిలో ఉపాలయంగా ఉన్న అభయాంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద గత పదహారు రోజులుగా భక్తులు సుందరకాండ పారాయణ నిర్వహిస్తున్నారన్నారు. ముగింపును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, 11వ తేదీన శ్రీరామ పట్టాభిషేకం, తులసి పూజ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలకమండలి చైర్మన్ మద్దు గోపి, కొల్లూరు వీరభద్ర రావు, లలిత దంపతులు పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయంతో లాభసాటి

భీమడోలు: వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించి, సుస్థిరమైన లాభసాటి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని ఏలూరు ఏడీఏ లలితసుధ అన్నారు. భీమడోలు సచివాలయం నంబర్–1 వద్ద ఆదివారం రైతులు, కౌలు రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు భీమడోలు ఏవో ఎస్‌పీఎల్ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ లలితాసుధ, వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి, పెదవేగి ప్రధాన శాస్త్రవేత్త రామచంద్రుడు, ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపును తట్టుకునే వరి వంగడాలైన ఎంటీయూ 1312, 1318, 1310, 1229 రకాల గురించి రైతులకు వివరించారు. డ్రోన్ పద్ధతిలో పిచికారీ విధానాలపై రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఎఎంసీ చైర్మన్ శేషపు గిరి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతారన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దుదాం

దెందులూరు: మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను మార్చడమే లక్ష్యమని, ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రెండురోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అందించారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలోని ఆశ్రమ్ ఆసుపత్రిలోని క్రీడామైదానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో మొదటి స్థానం పొందిన పోలీసు టీం, రెండవ స్థానం పొందిన జ్యుడీషియల్ టీం, మూడవ స్థానం పొందిన రెవెన్యూ టీం క్రీడాకారులకు బహుమతులను కలెక్టర్, ఎస్పీలు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వీ విశ్వేశ్వరరావు, డీఎస్‌డీఓ బీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌డీసీ ఫ్యాన్‌ల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: ప్రయాణికుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో పరిధిలోని స్టేషన్‌లలో బీఎల్‌డీసీ ఫ్యాన్‌లు ఏర్పాటు చేసినట్లు జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన, తక్కువ విద్యుత్ వినియోగించే బీఎల్‌డీసీ ఫ్యాన్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ వారు సామాజిక బాధ్యతలో భాగంగా పంపిణీ చేశారన్నారు. వీటిని వినియోగించడం వల్ల విద్యుత్ వినియోగం తగ్గి పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో మణి బాలాజీని పరామర్శిస్తున్న వాసు, జ్యోతి శ్రీనివాస్

ద్వారకాతిరుమల: ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో కామెర్లకు చికిత్స పొందుతున్న ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోకన్వీనర్ వసంతాటి శ్రీనివాస్ కుమారుడు మణి బాలాజీని ఆదివారం ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు పరామర్శించారు. మణి బాలాజీ కామెర్లతో బాధపడుతూ గతనెల 31న ఆశ్రం ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న వాసు, పార్టీ నేత పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్‌తో కలసి ఆస్పత్రికి వెళ్లి మణి బాలాజీని పరామర్శించారు. ఆ తరువాత వసంతాటి శ్రీనివాస్‌తో మాట్లాడి అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు, ప్రతిష్ఠించిన గంగానమ్మ విగ్రహం

బుట్టాయగూడెం: మండలంలోని తెల్లంవారిగూడెంలో గ్రామదేవత గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బాలరాజు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు అనిపెద్ది విశ్వనాథశర్మ పూజా కార్యక్రమాలను జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు దంపతులు కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ప్రతిభ పురస్కారానికి ఇంటర్ విద్యార్థులు


గుడిమెట్ల సంతోషి


గద్దే అశ్విన్ కుమార్



పెడసనగంటి వర్షిత సాయి

జంగారెడ్డిగూడెం: ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ప్రతిభ పురస్కారం వరించింది. ఏలూరులో ఈనెల 9వ తేదీన సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డ్స్ కార్యక్రమంలో విద్యార్థులు పురస్కారాలను అందుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 34 మంది విద్యార్థులు అ పురస్కారాలకు ఎంపిక కాగా, జంగారెడ్డిగూడెం మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో జంగారెడ్డిగూడెం శ్రీరామచంద్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన గుడిమెట్ల సంతోషి, విద్యావికాస్ జూనియర్ కళాశాల నుంచి గద్దే అశ్విన్‌కుమార్, శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల నుంచి పెడసనగంటి వర్షిత సాయి ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్, రూ.20వేల నగదు బహుమతి అందించనున్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలంటూ ఆందోళన


రాజవరంలో సీసీ రోడ్లు నిర్మించాలంటూ ఆందోళన చేస్తున్న స్థానికులు

కొయ్యలగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజవరంలో సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి ఆయన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయరాజు మాట్లాడుతూ రాజవరం గ్రామంలోని కాలనీలో డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలైన బయ్యనగూడెం నుంచి సరిపల్లి, ధర్మారావుపేట, దిప్పకాయలపాడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాజవరం గ్రామ శాఖ కార్యదర్శిగా రేల నరసింహారావును, సహాయ కార్యదర్శిగా షేక్ మీరయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యడ్రావుల గాంధీ, రేలా శ్రీనివాస్, సాధు గురు కొండయ్య, రాంబాబు, బల్లె సూర్యమణి, బూరుగుపల్లి సుబ్బలక్ష్మి, సాధువులు ఏసన్న, నీలం లక్ష్మి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

జంగారెడ్డిగూడెం: నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 13న తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ఆదివారం జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడేళ్లుగా నిలిచిపోయిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తాపీ కార్పెంటర్ ఎలక్ట్రికల్ ప్లంబర్ పెయింటర్స్ తదితర నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది యు.ఏసుబాబు, మంచిలి రాజు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, మొల్లేటి శ్రీనివాస్, కె.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ తహసీల్దార్‌గా విజయకుమార్ రాజు

దెందులూరు: ఏలూరు రూరల్ మండల తహసీల్దార్‌గా ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ రెవెన్యూ స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి విజయకుమార్ రాజు నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం కలెక్టర్ వెట్రిసెల్వి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసులు దెందులూరు తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. దెందులూరు సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రియదర్శిని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు.

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జె.లలిత

వేలేరుపాడు: స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్కీమ్ వర్కర్ల రాష్ట్ర నాయకురాలు జె.లలిత, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నాయిగుట్ట గ్రామంలో స్కీమ్ వర్కర్ల మండల సదస్సును వెంకటేశ్వరమ్మ, రేవతిల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళలు, స్కూల్ స్వీపర్‌ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలన్నారు. స్కీంలో పనిచేసే మహిళా కార్మికులకు, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో స్కీం వర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశం అనంతరం స్కీం వర్కర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కౌలురి సైదా, కోకన్వీనర్లు సీహెచ్ రమాదేవి, కె.వెంకటలక్ష్మి, కె.కుమారి, సీతామహాలక్ష్మి, డి.రేవతిలను ఎన్నుకున్నారు. అలాగే మరో 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి గౌరవ సలహాదారుగా కారం ధారయ్యను నియమించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీయూసీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్‌కు విద్యార్థుల ఎంపిక


మధ్యాహ్నపు మౌనిక ప్రసన్న


వీర్ల పల్లవి నాగ సాయి


షేక్ ఒమీనా


కె.రుష్మిత లక్ష్మీ సాయి


దేవులపల్లి వేద్య ఎస్ఎస్ బాల


తైడాల తేజస్వి


మడివి సోనియా

జంగారెడ్డిగూడెం: పదో తరగతిలో ప్రతిభ చూపి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రకటించింది. ఏలూరు జిల్లాలో 163 మంది విద్యార్థులు ఈ అవార్డులకు ఎంపిక కాగా, అందులో జంగారెడ్డిగూడెం మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 9వ తేదీన ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమంలో విద్యార్థులను ప్రశంసాపత్రాలు, మొమెంటోలతో సత్కరించనున్నారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన కొణతాల రుష్మిత లక్ష్మీ సాయి 596 మార్కులు (విద్యావికాస్), మధ్యాహ్నపు మౌనిక ప్రసన్న 595 మార్కులు (శ్రీరామచంద్ర హైస్కూల్), తైడాల తేజస్వి 594 మార్కులు (నారాయణ స్కూల్), షేక్ ఒమీనా 593 మార్కులు (కిడ్స్ హైస్కూల్), వీర్ల పల్లవి నాగసాయి 592 మార్కులు (భాష్యం హైస్కూల్), మడివి సోనియా (భాష్యం హైస్కూల్) 591 మార్కులు, దేవులపల్లి వేద్య ఎస్ఎస్ఎన్ బాల (జెడ్పీ హైస్కూల్ (బాలురు)) 465 మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని బాలాలయ ప్రవేశం


ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (తాడేపల్లిగూడెం రోడ్డు) నూతన ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా దేవేరులతో సహా స్వామి వారికి బాలాలయ ప్రవేశం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయానికి ఉత్తరం వైపున ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి అందులో ప్రతిష్ఠ చేశారు. బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మామిళ్ళపల్లి దేవిసీతారాం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయం నిర్మించే వరకు స్వామివారిని బాలాలయంలో ఏర్పాటు చేసి నిత్య పూజాది కైంకర్యాలు నిర్వహిస్తామని నరసింహ శర్మ తెలిపారు. దీనిలో భాగంగా కళాహోమం, కళాఆవరణ హోమాలు ముందుగా గణపతి పూజ, పుణ్యావాచనం తదితర ప్రత్యేక పూజలను చేశారు. ఆలయానికి పడమర వైపు మూడున్నర సెంట్లు విస్తీర్ణంలో సుమారు 30 లక్షల రూపాయలకు పైగా అంచనాతో ఆలయాన్ని దాతల సహాయంతో నిర్మిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు మట్టా సత్తిపండు, మంతెన సోమరాజు, మేకల అన్నవరం, మంచాల వెంకయ్య నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారసింహునికి పంచామృతాభిషేకాలు


ఆలయ యాగశాలలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ముందుగా ఆలయంలో అర్చకులు, పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధనను నిర్వహించారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణల నడుమ సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలను జరిపారు. ఆ తరువాత గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలు, నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ఆఖరిలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆలయ ఆవరణలో జరిగిన అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంట గ్రామంలో కొలువైన శ్రీరాట్నాలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా రుసుముల ద్వారా రూ.54,070, విరాళాల ద్వారా రూ.15,326, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.21,990, పులిహోర అమ్మకం ద్వారా రూ.3,150, ఫొటోల ద్వారా రూ.3,245 ఆదాయం లభించగా, మొత్తం ఆదాయం రూ.94,976 లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

దెందులూరు: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న గోపన్నపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి కుమారికి ఆర్థిక సహాయం అందించినట్లు చేయూత సంస్థ సభ్యులు తెలిపారు. భర్త లేకపోవడం, కొడుకు హోటల్‌లో పని చేయడం సొంత ఇల్లు కూడా లేకపోవడంతో, అనారోగ్యంతో ఆమె పడుతున్న ఇబ్బందులు గమనించి తమ సంస్థ చేయూత ద్వారా రూ.11 వేల నగదు, నిత్యావసర వస్తువులు అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.లక్ష్మీనారాయణ, పి.నాగార్జునరావు, ఎం.లక్ష్మణరావు, వి.రాజేంద్ర, ఇ.శరత్‌బాబు, జి.దుర్గారావు, ఆర్.మహేష్ పాల్గొన్నారు.